
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
శనివారం 29 నవంబరు 2025



ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల గడువు డిసెంబరు 7 వరకు పొడగింపు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు అడ్మిషన్ గడువును పొడగించినట్టు డీఈవో వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 7వ తేదీ వరకు అపరాధ రుసుముతో అవకాశం కల్పించినట్టు పేర్కొన్నారు. వివరాలకు 8008403635 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

కప్పేసిన మంచు దుప్పటి

ఉదయం 8 గంటలకూ వీడని పొగమంచు

సంగారెడ్డి క్రైం/పటాన్‌చెరు/తూప్రాన్/వెల్దుర్తి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి, మెదక్ జిల్లాలను శుక్రవారం ఉదయం మంచు దుప్పటి కప్పేసింది. సంగారెడ్డి పట్టణం, పటాన్‌చెరు పారిశ్రామికవాడతో పాటు మెదక్ జిల్లా తూప్రాన్, వెల్దుర్తి సహా పలు మండలాల్లో ఉదయం 8 గంటల వరకు పొగ మంచు వీడలేదు. ఇరవై అడుగుల దూరంలో ఉన్నదీ కనిపించలేదు. వాహనాలు లైట్లు వేసుకుని నడపాల్సి వచ్చింది. పొగమంచు కమ్ముకుంటున్న నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ఉదయం వేళ ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. మంచుతో పాటు ఈదురుగాలులు వీస్తుడడంతో వృద్ధులు, చిన్నారులు, వ్యాధిగ్రస్తులు ఇబ్బందులు పడుతున్నారు.





కార్యక్రమంలో మాట్లాడుతున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న నిర్మలాజగ్గారెడ్డి

హాజరైన మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని డా. బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్‌జిల్లా బాస్కెట్‌బాల్ పోటీల్లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలజగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యమిస్తుందని తెలిపారు. ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ ఎంపీ నిధులతో మరో బాస్కెట్‌బాల్ కోర్టును ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పృథ్వీశ్వర్‌రెడ్డి, కోశాధికారి, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రూ.2వేలతో సర్పంచ్.. రూ.120కే ఉపసర్పంచ్
నాడు స్వచ్ఛంద మద్దతుతో గెలుపు
నేడు అవినీతి, ధన ప్రభావం
నేటి రాజకీయాలపై ఆందోళన 7

స్థానిక ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ కీలకపాత్ర పోషించాలి
యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి పిలుపు 7

ఎన్నాళ్లిలా.. నామినేషన్‌కు వెళ్లేది ఎలా? 7

అప్పీలుకు అవకాశం
తిరస్కరించిన నామినేషన్‌పై అభ్యంతరం దాఖలు చేయొచ్చు 7

ఆత్మహత్యకు ప్రయత్నించిన తల్లీకుమార్తె..
రక్షించిన పోలీసులు 6

మద్యం నో స్టాక్..!



● వైన్స్‌లో నిల్వలు ఖాళీ ● బెల్టు షాపుల్లో ధరలకు రెక్కలు ● మందుబాబులకు షాక్

మెదక్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు అంటే మద్యం ఏరులై పారుతుంది. గ్రామ పచాయతీ ఎన్నికల కోలాహంల ప్రారంభమైంది. మొదటి విడత ఎన్నికలకు జోరుగా నామినేషన్లు వేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వైన్స్‌లో నోస్టాక్ బోర్డులు కార్యకర్తలను, అభ్యర్థులతో పాటు ఆశావహులకూ ఆందోళనకు గురిచేస్తున్నాయి. కొన్నిచోట్ల ఏకంగా వైన్స్‌లు బంద్ పెట్టడంతో బెల్ట్‌షాపులల వైపు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. టెండర్లలో కొత్తగా వైన్‌షాపులు రానివారికి పాత లైసెన్స్ ఈ నెల 30తో ముగియనుంది. దీంతో, వారు కొత్త స్టాకు పెట్టకండా ఉన్న స్టాకునే అమ్ముకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా పక్షం రోజులుగా వైన్స్ ఖాళీగా ఉంటున్నాయి. ఉదయం 10 గంటలకే షాపులు తెరిచి మద్యం కొనుగోలుదారులకు స్వాగతం పలికే సిబ్బంది ప్రస్తుతం స్టాక్ లేదని చేతులెత్తేస్తున్నారు. జిల్లాకేంద్రమైన మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో ఎప్పుడూ కస్టమర్లతో కిక్కిరిసి ఉండే వైన్స్ స్టాక్ లేక బోసిపోతోంది. పాత లైసెన్సులు పూర్తయి కొత్త షాపులు డిసెంబరు 1 నుంచి ప్రారంభం కానుండటంతో కొత్తగా సరుకు దిగుమతి చేసుకోవడం లేదని యజమానులు తెలిపారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా 49 వైన్ షాపుల్లో కొంతమందికే మళ్లీ కొత్త షాపులు దక్కడంతో వారు మాత్రమే స్టాకు ఉంచుతున్నారు. మిగిలిన వారు పాత స్టాకును అమ్ముకునే పనిలో నిమగ్నమయ్యారు. నిబంధనల ప్రకారం అన్ని బ్రాండ్‌లు అందుబాటులో ఉంచాల్సి ఉన్నా టీచర్స్, బ్లాక్ డాగ్, బ్లాక్ అండ్ వైట్, హండ్రెడ్ పైపర్స్ తదితర బ్రాండ్ల లభ్యం కావడం లేదని మందుబాబులు వాపోతున్నారు. బ్లెండర్‌ప్రైడ్, సిగ్నేచర్, రాయల్ స్టాగ్ సైతం కొన్ని షాపుల్లోనే లభ్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మెదక్‌లో స్టాకు లేక వెలవెలబోతున్న వైన్‌షాపు

బెల్ట్‌షాపుల్లో దోపిడీ

వైన్‌షాపుల్లో దొరకని బ్రాండ్లన్నీ బెల్ట్‌షాపుల్లో లభ్యమవుతున్నాయి. అయితే, అవి అధిక ధరలకు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో వీధివీధిలో బెల్టుషాపులు వెలిశాయి. ఎక్సైజ్‌శాఖ అధికారుల ఉదారత్వంతో యథేచ్ఛగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం స్థానిక సర్పంచ్ ఎన్నికలు జరుగుతున్నవేళ పగలురాత్రి తేడా లేకండా పల్లెల్లో మందు అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

విరామం తప్పనిసరి

ప్రతీ ఏడాదీ ఇదేవిధంగా లైసెన్స్ ముగియనున్న చివరి రెండు మూడు రోజులూ దోపిడీ కొనసాగుతూనే ఉంటుందని వినియోగదారులు నిట్టూరుస్తున్నారు. ప్రతీసారి పాత లైసెన్స్‌లు ముగిసి కొత్త లైసెన్స్‌లు అమలులోకి వచ్చే సమయంలో కొత్త షాపుల యజమానులు కేవైసీ, డిపాజిట్లు, సెటప్ ఏర్పాటు చేసుకోవడం, ప్రభుత్వ ఆదాయ లెక్కలు చేయడంతో పాటు డీఫాల్ట్ కేసులు క్లోజ్ చేసేందుకు ప్రతీ రెండేళ్లకు రెండ్రోజుల విరామం అనివార్యమవుతోందని రామాయంపేటలోని ఓ వైన్‌షాపు యజమాని తెలిపారు.

అన్ని పత్రాలను పరిశీలించాలి

మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అభ్యర్థుల నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మెదక్‌లోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన ఎంపీడీవోలు, ఆర్వో, ఏఆర్వోలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నామినేషన్ పత్రాల్లో ఏవైనా సర్టిఫికెట్లు సమర్పించకపోతే చెక్‌లిస్టులో రాసివ్వాలని ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు నూతన బ్యాంక్ అకౌంట్ తప్పనిసరి అని తెలపారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది కోసం పోస్టల్ బ్యాలెట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. రెండో విడత ఎన్నికల కోసం అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీసీఈవో ఎల్లయ్య, డీపీవో యాదయ్య, డీవైఎస్‌వో రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హవేళిఘణపూర్‌లో నామినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న మెదక్ కలెక్టర్

పారదర్శకంగా నామినేషన్ల ప్రక్రియ

హవేళిఘణపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కొనసాగుతున్న నామినేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ల పారదర్శకంగా సాగేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నామినేషన్ కేంద్రాల వద్ద శాంతియుత వాతావరణం ఉండేలా చూడాలని ఆదేశించారు. చివరి రోజు కావడంతో నేడు పెద్దసంఖ్యలో నామినేషన్లు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇందుకు తగినట్లు ఏర్పాట్లు చేయాలన్నారు. తహసీల్దార్ సింధురేణుక, ఎన్నికల అధికారి శ్రేయంత్ ఉన్నారు.



సంగారెడ్డిలో మీడియా పాయింట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

మీడియా పాయింట్ ద్వారా ఎన్నికల సమాచారం

సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మీడియా పాయింట్ ద్వారా గ్రామ పంచాయతీ ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు తెలియజేయాలని సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో మీడియా పాయింట్‌ను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోషల్ మీడియాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించి చేసిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎంసీఎంసీ సెల్ ద్వారా పెయిడ్ న్యూస్‌ను గుర్తించి సకాలంలో ప్రచార ప్రకటనలకు అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. పారదర్శకంగా నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు మీడియా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీపీఆర్‌వో విజయలక్ష్మి, అదనపు డీపీఆర్‌వో ఏడుకొండలు, ఎంసీఎంసీ కమిటీ సభ్యులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



పిల్లికొట్టాల్‌లో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణం (ఫైల్)

హౌసింగ్ శాఖ పరిధిలోకి 'డబుల్‌బెడ్రూం'

రికార్డులను అప్పగించిన పంచాయతీశాఖ

మెదక్ మున్సిపాలిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన డబుల్ బెడ్రూం ఇళ్ల పథకాన్ని హౌసింగ్‌శాఖ పరిధిలోకి తీసుకువస్తూ తాజాగా సర్కారు నిర్ణయం తీసుకోవడంతో ఆ శాఖ అధికారులు రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. అసంపూర్తి పనులు, లక్ష్యాలను చేరుకోకపోవడం వంటి సమస్యల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈమేరకు మెదక్ జిల్లా కేంద్రంలోని డబుల్‌బెడ్రూం ఇళ్లను పీడీ మాణిక్యం, డీఈ యాదగిరి కలిసి పరిశీలించి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. అసంపూర్తిగా ఉన్న డబుల్‌బెడ్రూం ఇళ్లను పూర్తిచేయడానికి అవసరమైన అంచనాలను రూపొందించి హౌసింగ్‌శాఖ ద్వారా నిధులు కేటాయించనున్నట్లు వారు చెప్పారు. అసంపూర్తిగా ఉన్న వాటిని స్వయంగా నిర్మించుకోవడానికి ఎంపిక చేయబడిన లబ్ధిదారులకే నేరుగా నిధులు కేటాయించనున్నట్లు డీఈ యాదగిరి తెలిపారు.

రెండో రోజు నామినేషన్ల జోరు

మెదక్ జిల్లాలో 186 దరఖాస్తులు
హవేళీఘణపూర్‌లోనే 49 అప్లికేషన్లు
పల్లెల్లో ఊపందుకున్న రాజకీయాలు

మెదక్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల తొలి విడత నామినేషన్లు హుషారుగా సాగాయి. శుక్రవారం ఉదయం నుంచే మండల కేంద్రాల వద్ద రద్దీ నెలకొంది. మెదక్ జిల్లాలోని ఆరు మండలాల పరిధిలో మొత్తం 186 నామినేషన్లు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. జిల్లాలోని అల్లాదుర్గంలో సర్పంచ్‌కు 14, హవేళీఘణపూర్‌లో 49 సర్పంచ్, వార్డు సభ్యులు 65, పాపన్నపేటలో సర్పంచ్ 25, వార్డు సభ్యులు 22, రేగోడ్ సర్పంచ్ 18, వార్డు సభ్యులు 11, పెద్ద శంకరంపేట సర్పంచ్ 17, వార్డు సభ్యులు 40, టేక్మాల్ సర్పంచ్ 29, వార్డు సభ్యులు 37 మంది నామినేషన్లు వేశారు.

రెండో రోజు 191 నామినేషన్లు

సంగారెడ్డి టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో శుక్రవారం సర్పంచ్ స్థానాలకు 191 నామినేషన్లు దాఖలు చేశారు. జిల్లాలోని తొలి విడత ప్రక్రియలో భాగంగా 136 గ్రామ పంచాయతీలకు, 1,246 వార్డులకు ఎన్నికలు జరుగుతున్న విషయం తెలిసిందే. నామినేషన్ల రెండో రోజు సర్పంచ్‌కు 191, వార్డులకు 760 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు అయ్యాయి.

నేటితో ముగియనున్న తొలి విడత నామినేషన్ల గడువు

తొలి విడతలో పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ నేటితో ముగియనుంది. ఈ నెల 27న తొలిదశ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమై 29వ తేదీతో ముగుస్తోంది. నేడు చివరి రోజు కావడంతో శనివారం భారీ సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తారని అధికారులు భావిస్తున్నారు. తొలి విడతలో అల్లాదుర్గం, రేగోడ్, టేక్మాల్, హవేళీఘణపూర్, పాపన్నపేట, పెద్ద శంకరంపేట మండలాల్లోని 160 గ్రామపంచాయితీల్లో 1,402 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. 30వ తేదిన నామినేషన్ల పరిశీలన, డిసెంబరు 1న నామినేషన్ల అప్పీలు, 2వ తేదీన డిస్పోజల్, 3న తేదీన నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగియనుంది.



నామినేషన్ వేయడానికి వెళ్తున్న కొండాపూర్ అభ్యర్థి మన్సు, అలవేణినర్సింహారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర

రాజీ మార్గమే రాజమార్గం

సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర

సంగారెడ్డి క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చిన్న తగాదాలకే కేసులు పెట్టుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా, రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవాలని సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీచంద్ర పేర్కొన్నారు. వచ్చే నెల 21వ జాతీయ లోక్‌అదాలత్ తేదీన నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. జిల్లా కోర్టులో శుక్రవారం బ్యాంకు, ఇన్సురెన్స్, చిట్‌ఫండ్స్ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజీ పడే అన్ని కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించాలని పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య, లీడ్ బ్యాంక్ మేనేజర్ నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల వ్యూహంపై పీసీసీ అధ్యక్షుడి ఆరా

కాంగ్రెస్ చీఫ్‌ను కలిసిన డీసీసీ ప్రెసిడెంట్ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

మెదక్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జిల్లాలో కొనసాగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరుస్తున్న అభ్యర్థుల గెలుపు కోసం అనుసరిస్తున్న వ్యూహంపై రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మెదక్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కలిశారు. స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించారు. పీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. బీఆర్ఎస్, బీజేపీలు ఓటర్లను మభ్యపెట్టే అవకాశం ఉందని, కార్యకర్తలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను పల్లెల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. గ్రామ, వార్డుస్థాయి నాయకత్వం బలోపేతం, కార్యకర్తల ఐక్యత, వ్యవస్థీకరణ, యువతను పార్టీలో మరింతగా చేర్చుకునే వ్యూహాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలను అధిష్టానం గుర్తించి పోత్సహిస్తుందన్నారు. జిల్లాలోని 21 మండలాల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కలిసి పనిచేయాల్సిందిగా సూచించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సత్తా చాటాలని పేర్కొన్నారు. తనకు పార్టీ నాయకత్వం అప్పగించిన బాధ్యతను నెరవేరుస్తానని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు పేర్కొన్నారు.



మహేష్‌కుమార్‌గౌడ్‌ను సత్కరిస్తున్న ఆంజనేయులుగౌడ్, మైనంపల్లి హన్మంతరావు

నేటి నుంచి మల్లన్న జాతర

నారాయణఖేడ్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అనంత్‌సాగర్‌లో శనివారం నుంచి సోమవారం వరకు మల్లన్న జాతర మహోత్సవాలను నిర్వహించనున్నట్లు గ్రామస్థులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం బండ్ల ప్రదక్షణ, ఆదివారం స్వామి వారి కల్యాణం, మహాప్రసాద వితరణ, బండిషిడీ, బోనాలు, సోమవారం పాచిబండ్ల ప్రదక్షణ, నాటక ప్రదర్శన నిర్వహించనున్నట్లు వివరించారు.

ఎరక్కపోయి వచ్చాను.. ఇరుక్కుపోయాను..!



అల్లాదుర్గంలోని అండర్ బ్రిడ్జిలో ఇరుక్కుపోయిన ధాన్యం లారీ

- ఎత్తు తక్కువలో అల్లాదుర్గంలోని అండర్ బ్రిడ్జి
- తరచూ ఇరుక్కుపోతున్న వాహనాలు

అల్లాదుర్గం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అల్లాదుర్గంలోని అండర్ బ్రిడ్జి ఎత్తు తక్కువతో నిర్మించడంతో వాహన చోదకులు ఈ బ్రిడ్జి దాటాలంటే అష్టకష్టాలు పడుతున్నారు. శుక్రవారం అల్లాదుర్గం నుంచి వెళ్తున్న ఓ ధాన్యం లారీ ఈ బ్రిడ్జిలో ఇరుక్కుపోవడంతో డ్రైవర్ లారీని బయటకు తీసేందుకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నాడని స్థానికులు తెలిపారు. ఎన్నో గ్రామాలకు కూడలిగా ఉన్న అల్లాదుర్గం మండల కేంద్రం మీదుగా నిర్మించిన ఫ్లైఓవర్‌కు సంబంధించి జాతీయ రహదారి అధికారులు ముందు చూపు లేకుండా తక్కువ ఎత్తులో నిర్మించడంతో స్థానికులు అప్పట్లో అభ్యంతరం వ్యక్తం చేశారు. కానీ అధికారులు ఇవేమి పట్టించుకోకుండా ఇష్టాను సారంగా నిర్మించడంతో నేడు ఈ అండర్ బ్రిడ్జి కింది నుంచి వాహనాలు వెళ్లాలంటే నరకయాతన పడవలసి వస్తుంది.

గత వారం రోజుల క్రితం ఓ చెరుకు లారీ ఇరుక్కుపోవడం, నేడు ధాన్యం లారీ, గతంలో ఓ కంటైనర్ ఇలా పలు వాహనాలు ఈ బ్రిడ్జిలో ఇరుక్కుపోయాయని గ్రామస్థులు చెప్పారు. హైవే అధికారులు ఈ అండర్ బ్రిడ్జి ఎత్తు పెంచేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిందితుడి అరెస్టు..

● సొత్తు రికవరీ

తూప్రాన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలో జరిగిన చోరీని పోలీసులు 48 గంటల్లో చేధించారు. చోరీ చేసిన నిందితుడి నుంచి బంగారు, వెండి అభరణాలు, నగదు రికవరీ చేశారు. తూప్రాన్ సీఐ రంగ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ చింతల్ (గణేశ్‌నగర్)లో నివాసముండే నర్సాపూర్ మండలం పెద్ద చింతకుంటకు చెందిన కట్ట నవీన్ (26)ను తూప్రాన్ పట్టణంలో నర్సాపూర్ రోడ్డు బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీలో పట్టుకున్నట్లు తెలిపారు. అతడిని అనుమానంతో పట్టుకోగా చోరీ చేసిన వస్తువులు అమ్మకాలు చేసేందుకు నర్సాపూర్ వెళుతున్నట్లు గుర్తించారు. అతడిని విచారించగా తూప్రాన్ పట్టణానికి చెందిన అస్రాఫ్ అలీ ఇంట్లో 25న రాత్రి చోరీ చేసిన 7 తులాల బంగారు అభరణాలు, 37 తులాల వెండి అభరణాలు, రెండు విలువైన వాచ్‌లు, రూ. 20 వేల నగదు చోరీ చేసినట్లు గుర్తించారు.

ఆత్మహత్యకు ప్రయత్నించిన తల్లీకుమార్తె..

● రక్షించిన పోలీసులు

తూప్రాన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తాగుడుకు బానిసైన భర్త వేధింపులకు గురిచేయడం. చెరువులో దూకి చనిపోమని తిట్టడం.. ఫంక్షన్‌కు వెళ్లొచ్చిన తల్లీకూతుర్లను ఇంట్లోకి రాకుండా భర్త ఇంటికి తాళం వేసుకోవడంతో మనస్తాపం చెందిన తల్లీకుమార్తెలు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చారు. వారిని పోలీసులు రక్షించి కుటుంబీకులకు అప్పగించారు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి తూప్రాన్ పెద్ద చెరువు వద్ద చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్సై-2 యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ పట్టణానికి చెందిన లింగ రాణి, లింగ శివశంకర్ దంపతులు పనులు చేసుకొని జీవిస్తున్నారు. శివశంకర్ తాగుడుకు బానిసై భార్య రాణిని వేధింపులకు గురి చేస్తున్నాడు. తాగొచ్చి చెరువులో దూకి చనిపోవాలంటు తిడుతున్నాడు. శుక్రవారం రాణి కూతురు అశ్వినీతో కలిసి ఫంక్షన్‌కు వెళ్లి సాయంత్రం 6గంటలకు ఇంటకి వచ్చింది. ఇంటికి తాళం వేసి ఉండటంతో రాణి భర్త శివశంకర్‌కు ఫోన్ చేయగా, చనిపోమ్మంటూ తిట్టినట్లు చెప్పారు. దాంతో మనస్తాపానికి గురై రాణి, ఆమె కూతురు అశ్వినీ తూప్రాన్ పెద్ద చెరువులో దూకేందుకు వెళ్లారు.

ఈ విషయం గుర్తించిన రాణి అత్త 100 డయల్ చేసింది. డ్యూటీలో ఉన్న పోలీసులు రవి, శ్రీకాంత్ పెద్దచెరువు వద్దకు వెళ్లి ఆత్మహత్య చేసుకోడానికి చెరువులోకి దిగుతుండగా, రక్షించారు. భర్తను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి అప్పగించినట్లు ఎస్సై యాదగిరి వివరించారు.


ఆత్మహత్యకు ప్రయత్నించిన తల్లీకూతుర్లను రక్షించిన పోలీసులు

గంజాయి కేసులో నిందితులకు జరిమానా, జైలు

సంగారెడ్డి క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా కేసులో నలుగురు నిందితులకు పది సంవత్సరాల జైలు శిక్ష, ఒకరికి ఐదు సంవత్సరాల జైలు, నలుగురికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున, ఒకరికి రూ.25 వేలు జరిమానా విధించారు. జిల్లా మొదటి అదనపు న్యాయాధికారి కె.జయంతి శుక్రవారం తీర్పు చెప్పారు. మెదక్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జె.హరి కిషన్ తెలిపిన వివరాల ప్రకారం... 2021 ఫిబ్రవరి నెలలో జహీరాబాద్‌కు చెందిన నిందితులు రాథోడ్ మోహన్, రాథోడ్ వెంకట్, కేతావత్ పాండు నాయక్, రాథోడ్ మోతీరామ్‌లు 102 కిలోల గంజాయి రవాణా చేస్తుండగా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జహీరాబాద్‌లో పట్టుకున్నారు.

అలాగే ఒడిశా రాష్ట్రం మలల్కానగిరి జిల్లా నలగుంతికి చెందిన సోరాజిత్ బిస్వాస్ (36) ఎండు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తుండగా 2019 జూన్ 10వ తేదీన సంగారెడ్డి ఎక్సైజ్ పోలీసులు పట్టణంలోని కొత్తబస్టాండ్ వద్ద పట్టుకున్నారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితులకు జైలు శిక్షతో పాటు, జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

సంగారెడ్డి క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని ఓ మహిళ మృతి చెందిన ఘటన సంగారెడ్డిలో శుక్రవారం ఉదయం జరిగింది. సంగారెడ్డి పట్టణ సీఐ పి.రాము నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం భానూర్ గ్రామానికి చెందిన మొగిలిగారి ద్వారకేశ్వరి (52) మల్కాపూర్‌లో నివాసముంటున్న తన చెల్లెలు దగ్గరకు మూడు రోజుల క్రితం వచ్చింది. పట్టణంలోని గణేష్‌నగర్‌లో ఉంటున్న ఆమె అల్లుడు హరిచరణ్‌రెడ్డి ఇంటికి వెళ్లడానికి శుక్రవారం పట్టణంలోని ధరణి ఆసుపత్రి ఎదుట ఆటో దిగి రోడ్డు దాటుతుండగా పోతిరెడ్డిపల్లి నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్న హుండై కారు (నంబరు ఎపి39క్యుడబ్ల్యు 2929) ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ద్వారకేశ్వరి అక్కడికక్కడే మృతి చెందింది. అయితే మృతురాలికి వివాహం కాలేదు. మృతురాలి అల్లుడు హరిచరణ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ రాము నాయుడు తెలిపారు.


ద్వారకేశ్వరి (ఫైల్)

వడ్లకుప్పను ఢీకొని రైతు..

చిన్నకోడూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) :రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై ఓ రైతు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చిన్నకోడూరు మండలం గంగాపూర్ శివారులో శుక్రవారం జరిగింది. ఎస్సై సైఫ్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం తెనుగువానిపల్లికి చెదిన వంచ రవీందర్‌రెడ్డి (45) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శుక్రవారం ఉదయం రవీందర్ రెడ్డి ఓ పని నిమిత్తం బైక్ పై సిద్దిపేటకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో గంగాపూర్ శివారులోకి రాగానే రోడ్డుపై ఆరబోసిన వడ్ల కుప్పకు బైక్ ఢీకొట్టి కిందపడటంతో రవీందర్‌రెడ్డి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం రవీందర్‌రెడ్డి మృత దేహాన్ని ఓ ప్రైవేట్ వాహనంలో సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య సుప్రియ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ ఘటన పై ఫిర్యాదు అందలేదని ఎస్సై తెలిపారు


రవీందర్ రెడ్డి (ఫైల్)

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

తూప్రాన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువకుడు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన తూప్రాన్ మండలం వెంకటాయపల్లిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్సై శివానందం కథనం ప్రకారం.. తూప్రాన్ మండలం వెంకటాయల్లికి చెందిన ఉప్పల తిరుపతి (33) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గురువారం తిరుపతిని ఐకేపీ కేంద్రం వద్ద ఉన్న వడ్ల వద్దకు వెళ్లాలని చెప్పి, భార్య లక్ష్మి కూలీ పనులకు వెళ్లింది. రాత్రి ఇంటికి వచ్చిన భార్య లక్ష్మి తిరుపతి ఉరి వేసుకున్నట్లు గుర్తించి, వెంటనే తూప్రాన్ ఆసుపత్రికి తరలించగా మృతిచెందినట్లు ధ్రువీకరించారు. లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివానందం తెలిపారు.


తిరుపతి(ఫైల్)



నారాయణఖేడ్ డివిజన్‌లో పెద్ద పంచాయతీ నిజాంపేట.. చిన్నది గుండుతండా

నారాయణఖేడ్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ డివిజన్ పరిధిలో 196 గ్రామ పంచాయతీలు ఉన్నప్పటికీ, అతి పెద్ద గ్రామ పంచాయతీ మండల కేంద్రమైన నిజాంపేట కాగా, అతి చిన్నది ఖేడ్ మండలంలోని గుండు తండా. గతంలో నియోజకవర్గ కేంద్రమైన నారాయణఖేడ్ మేజర్ గ్రామ పంచాయతీగా ఉండేది. 9 సంవత్సరాల క్రితం మున్సిపాలిటీగా ఏర్పడడంతో నిజాంపేట పెద్ద పంచాయతీగా ఏర్పడింది. నిజాంపేటలో 4,259 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 2033, స్త్రీలు 2226 మంది ఉన్నారు. డివిజన్‌లో చిన్న పంచాయతీగా గుండు తండా ఉంది. మొత్తం 250 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 124, స్త్రీలు 126 మంది.

అప్పీలుకు అవకాశం

మీకు తెలుసా?

తిరస్కరించిన నామినేషన్‌పై ఆర్డీవోకు అభ్యంతర పత్రం దాఖలు చేయొచ్చు



హుస్నాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యుడిగా పోటీ చేసే అభ్యర్థి నామినేషన్ తిరస్కరించినట్లయితే అప్పీలుకు వెళ్లే అవకాశం ఉంటుంది. ఆ అభ్యర్థి సంబంధిత ఆర్డీవోకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి నిర్ణయంపై అభ్యంతర పత్రం సమర్పించవచ్చు. నామినేషన్‌ల దాఖలు ముగిసిన అనంతరం తర్వాత రోజు వాటి పరిశీలన చేపడతారు. ఒకవేళ ఈ పరిశీలనలో నామినేషన్ తిరస్కరణకు గురైనా, మరే ఇతర విషయాలపైన అయినా అభ్యంతరం తెలిపేందుకు ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఆ మరుసటి రోజు అవకాశం కల్పించారు. ఈ అప్పీల్‌పై ఆతరువాత రోజు అధికారులు పరిష్కారం వెల్లడిస్తారు.



సమానంగా ఓట్లు.. టాస్‌తో గెలుపు

కల్హేర్ మండలంలోని జంలా తండాలో 2019లో సర్పంచ్‌గా బలరామ్


టాస్‌తో సర్పంచ్‌గా ఎన్నికైన దేవసోత్ బలరామ్, సమానంగా ఓట్లు సాధించిన మంగిళిబాయి

కల్హేర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇద్దరు సర్పంచ్ అభ్యర్థులకు సమానంగా ఓట్లు వేసి విచిత్రమైన తీర్పు ఇచ్చారు కల్హేర్ మండల పరిధిలోని బీబీపేట్ జంలా తండా ఓటర్లు. బీబీపేట పంచాయతీలో ఉన్న తుకారాం తండా, జంలా తండాను కలిపి 2019 నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటైంది. ఎస్టీ జనరల్‌కు రిజర్వ్ కాగా, నాటి ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో దేవసోత్ బలరామ్, కాంగ్రెస్ మద్దతుతో కడావత్ మంగిళిబాయి పోటీ చేశారు. రెండు తండాల్లో కలిపి 600 ఓటర్లు ఉండగా, హోరాహోరీ పోరు జరిగింది. తీరా ఓట్లు లెక్కింపు పూర్తి కాగానే పోలైన ఓట్లలో బలరామ్‌కు 286, మంగిళిబాయికి 286 సరిసమానంగా వచ్చాయి. దీంతో ఎన్నికల అధికారులు ఇద్దరు అభ్యర్థుల సమ్మతితో టాస్ వేసి విజేతను ఎంపిక చేయడానికి నిర్ణయించారు. టాస్ వేయగా సర్పంచ్ పదవి బలరామ్‌కు వరించింది. మంగిళిబాయి నిరాశతో నిష్క్రమించారు. సమానంగా ఓట్లు రావడంతో ఇద్దరు సర్పంచులుగా అర్హత సాధించినట్లేనని మంగిళిబాయిని ఎన్నికల అధికారులు, నాయకులు ఓదార్చారు. ప్రస్తుతం మంగిళిబాయి భౌతికంగా లేరు. ఆమె రెండేళ్ల సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మరణించారు.

స్థానిక ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ కీలకపాత్ర పోషించాలి

● యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి పిలుపు



మాట్లాడుతున్న యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి

మెదక్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరుస్తున్న అభ్యర్థుల గెలుపు కోసం యువజన కాంగ్రెస్ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని తెలంగాణ భవన్‌లో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పరశురాంగౌడ్ అధ్యక్షతన జిల్లాస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి మాట్లాడుతూ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ అన్ని విధాలుగా ప్రోత్సాహాన్ని అందిస్తున్నారని, అందులో భాగంగానే రాష్ట్రంలో 8 మంది యువజన కాంగ్రెస్ నేతలను డీసీసీ అధ్యక్షులుగా నియమించారని తెలిపారు. అదే విధంగా ఒక ఎమ్మెల్సీ, ఒక రాజ్యసభ ఎంపీ పదవిని ఇచ్చారని వివరించారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ పదవి దక్కిందని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి హాజరైన యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి భవ్యసింగ్ మాట్లాడుతూ సాధారణ మహిళ అయిన తనకు జాతీయ స్థాయిలో అవకాశం కల్పించిన ఘనత కేవలం కాంగ్రెస్ పార్టీదేనన్నారు. జిల్లాలో యువజన కాంగ్రెస్‌ను బలోపేతం చేయడంపైన దృష్టి పెట్టాలని శ్రేణులకు సూచించారు. ఈ సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యుడు మహేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు తరుణ్, రాంచెంద్రారెడ్డి, మెదక్ అసెంబ్లీ అధ్యక్షుడు భరత్‌గౌడ్, నర్సాపూర్ అధ్యక్షుడు సందీప్, జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి యువజన కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

రూ.2000తో సర్పంచ్.. రూ.120కే ఉపసర్పంచ్

నేడు అవినీతి, ధన ప్రభావం

నేటి రాజకీయాలపై అనుభవజ్ఞుల ఆందోళన

కొండపాక/సదాశివపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సేవ, నిబద్ధత ప్రధానంగా సాగిన మూడు దశాబ్దాల నాటి స్థానిక సంస్థల రాజకీయాలు ప్రస్తుత ధన, అధికార రాజకీయాల మధ్య ఎంతటి మార్పు వచ్చిందో ఇద్దరు సీనియర్ నాయకుల అనుభవాలు కళ్లకు కడుతున్నాయి. కేవలం మాటపై నమ్మకంతో, స్వచ్ఛంద మద్దతుతో నామమాత్రపు ఖర్చుతో ఎన్నికల్లో గెలిచి, గ్రామ అభివృద్ధికి కృషి చేసిన అప్పటి పరిస్థితులు నేడు పూర్తిగా మారిపోయాయి. ఇప్పుడు డబ్బున్న వాడిదే రాజ్యం అన్నట్టుగా విచ్చలవిడిగా డబ్బు ఖర్చు పెట్టి పదవులు చేజిక్కించుకుంటూ, అవినీతికి పాల్పడుతున్న తీరుపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



స్వచ్ఛంద మద్దతుతో రాజకీయ రంగ ప్రవేశం


నిమ్మ దుర్గారెడ్డి

సిద్దిపేట జిల్లా, కొండపాక మండలం బందారం గ్రామానికి చెందిన నిమ్మ దుర్గారెడ్డి 1988లో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో పాత తరం, సుమారు 18 సంవత్సరాలు గ్రామాన్ని ఏలిన నాయకుడిపై పోటీ చేసి గెలుపొందారు. ఆ రోజుల్లో దశాబ్దాల కాలం పాటు గ్రామాలను ఏలుతున్న పాత తరం నాయకులపై పోటీ చేయాలంటేనే భయపడే వారు. అయితే, యువకులంతా కలిసి స్వచ్ఛందంగా మద్దతు ఇవ్వడంతో దుర్గారెడ్డి రాజకీయ రంగ ప్రవేశం చేశారు. ఆనాటి రోజుల్లో గ్రామస్థుల నమ్మకంతో రూ.2000 లోపే ఎన్నికల ఖర్చుతోనే ఆయన విజయం సాధించారు. అప్పుడు మాటమీద కట్టుబడి, నమ్మకంతో ఉండేవారని, కానీ ప్రస్తుతం అవినీతి డబ్బు ప్రభావం పెరిగిందని, డబ్బు పంచేసి పదవిలోకి రావాలని చూస్తున్నారని ఆయన వాపోయారు. గ్రామం కోసం, అభివృద్ధి కోసం ఆస్తులు పోగొట్టుకునేవారని, ప్రస్తుతం పదవిని సంపాదించడం కోసం రాజకీయాల్లోకి వస్తున్నారని, అంతా డబ్బుతోనే ముడిపడి ఉందని ఆయన ప్రస్తుత పరిస్థితులను వివరించారు.

ప్రజాసేవతో ఏకగ్రీవంగా సర్పంచ్


గడీల రాంరెడ్డి

సంగారెడ్డి జిల్లా, సదాశివపేట మండలం కంబాలపల్లి గ్రామానికి చెందిన గడీల రాంరెడ్డి కూడా నాటి నిస్వార్థ రాజకీయాలకు నిదర్శనంగా నిలిచారు. 1995లో కేవలం రూ.120 ఖర్చుతో వార్డు సభ్యునిగా గెలుపొంది, ఆ తరువాత ఉపసర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 2001లో రూ.500 ఖర్చుతో రెండోసారి ఉపసర్పంచ్‌గా గెలిచారు. నిస్వార్థ ప్రజాసేవ, గ్రామ అభివృద్ధి కోసం రాంరెడ్డి చేసిన కృషిని గుర్తించిన గ్రామ ప్రజలు, 2006లో ఆయనను సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్పంచ్‌గా కంబాలపల్లి గ్రామానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చి, ఆ గ్రామం అప్పట్లో నిర్మల్ గ్రామ పురస్కారానికి ఎంపిక కావడంలో ఆయన కృషి ఎంతో ఉంది. 2011 నుంచి 2019 వరకు మండల కాంగ్రెస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షునిగా పనిచేసిన రాంరెడ్డి, తన నిస్వార్థ సేవను కొనసాగించారు. వార్డు మెంబర్, ఉపసర్పంచ్, సర్పంచ్ పదవుల్లో ప్రజల మెప్పు పొందిన ఆయన 2019 ఎన్నికల్లో తన సతీమణి గడీల శ్రీదేవిని సదాశివపేట జడ్పీటీసీగా గెలిపించారు. ప్రస్తుతం ఆయన సంగారెడ్డి జిల్లా సీడీసీ చైర్మన్‌గా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. ప్రజలకు చేసిన సేవలే తనను ఈ స్థాయికి తీసుకువచ్చాయని ఆయన పేర్కొన్నారు.


గడీల శ్రీదేవి

నాడు స్వచ్ఛంద మద్దతుతో గెలుపు

నిస్వార్థ సేవకే గుర్తింపు

ఎన్నాళ్లిలా.. నామినేషన్‌కు వెళ్లేది ఎలా?



గేటు మూసివేసిన రైల్వే అధికారులు

కోహీర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని రాజనెల్లి-పీచేర్యాగడి గ్రామాల మధ్య నెల రోజులుగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గ్రామ సమీపంలోని 26వ రైల్వే గేటును మూసివేసి ఆ ప్రాంతంలో అండర్ రైల్వే బ్రిడ్జిని నిర్మించారు. ప్రస్తుతం అందులో భారీగా వర్షం నీరు ఉండడంతో రాజనెల్లి-పీచేర్యాగడి గ్రామాల మధ్య రాకపోకలు కొనసాగడం లేదు. అయితే, పంచాయతీ ఎన్నికల దృష్ట్యా నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని పీచేర్యాగడిలోని రైతు వేదికల్లో ఏర్పాటు చేశారు. అయితే రాజనెల్లి, గురుజువాడ, మద్రి గ్రామాలకు చెందిన సర్పంచు, వార్డు సభ్యుల అభ్యర్థులు ఈ దారి గుండా వెళ్లి నామినేషన్లు దాఖలు చేసేందుకు వీలు లేదు. అండర్ బ్రిడ్జిలో వర్షం నీరు నిలిచి ఉండడంతో దగ్గరలోనే ఉన్న పీచేర్యాగడికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది.


కాలువను తలపిస్తున్న రాజనెల్లి-పీచేర్యాగడి గ్రామాల మధ్య ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి

సర్పంచ్‌గా పోటీ..ఆశావర్కర్ ఉద్యోగానికి రాజీనామా

రాయపోల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సర్పంచ్ పదవికి పోటీ చేసేందుకు ఓ ఆశావర్కర్ తన ఉద్యోగానికి రాజీనామా చేసింది. రాయపోల్ మండలం వడ్డెపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవి బీసీ మహిళకు రిజర్వ్ అయింది. దీంతో సర్పంచ్‌గా పోటీ చేసేందుకు నిర్ణయించుకున్న ఆ గ్రామానికి చెందిన ఆశావర్కర్ రాజగారి రేణుక తన ఉద్యోగానికి రాజీనామా చేసింది. ఆమె రాజీనామాను ఆమోదించి ఉన్నతాధికారులకు పంపించినట్లు ఇందుప్రియాల్ వైద్యాధికారి అశ్లేష తెలిపారు.

మహిళా విద్యకు మార్గదర్శకుడు పూలే

● నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు రూరల్, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి) : మహిళా విద్యకు మార్గదర్శకుడు పూలే అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం చిట్కుల్‌లోని నీలం ముదిరాజ్ నివాసంలో చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి సమాజంలోని అణగారిన వర్గాల హక్కుల కోసం కృషి చేసిన గొప్ప మహనీయుడు పూలే అన్నారు. మహిళా విద్య, బడుగు వర్గాల అభ్యున్నతి కోసం పూలే దంపతులు స్థాపించిన సత్యశోధక్ సమాజ్ వల్ల సమాజంలో ఉన్న అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనకు కారణమైంది అన్నారు. ఆయన చూపిన బాట సమాజానికి అనుసరణీయం అని నీలం మధు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అజ్జు, వంశీ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.


జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పిస్తున్న నీలం మధు ముదిరాజ్

ఖనిజాల పరిశోధనకు సాంకేతిక సమీక్ష

డిసెంబర్ 4 నుంచి ఐఐటీహెచ్‌లో అంతర్జాతీయ సదస్సు

దేశ, విదేశాల నుంచి ప్రఖ్యాత పరిశ్రమలు, పరిశోధనా సంస్థల రాక

కంది, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచవ్యాప్తంగా క్లిష్టమైన ఖనిజాలను వెలికి తీసేందుకు డిసెంబరు 4 నుంచి 6 వరకు సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఐఐటీహెచ్ అధికారులు శుక్రవారం ఆవిష్కరించారు. దేశంతో పాటు విదేశాల నుంచి ఆహ్వానించబడిన 24 మంది వక్తలు శక్తి పరివర్తనకు సంబంధించిన అధునాతన పదార్థాలు, క్లిష్టమైన ఖనిజాలపై తమ అత్యాధునిక పరిశోధనలను ప్రదర్శిస్తారు. ఇండియన్ ఇనిస్టూట్యూట్ ఆఫ్ మెటల్స్ విభాగం ఆధ్వర్యంలో 1400 సాంకేతిక సారాంశాలలో 60 మందితో కూడిన సాంకేతిక సమీక్ష కమిటీలు జరగనున్నాయి. అంతేగాక అత్యుత్తమ నిపుణులు 14 సమాంతర సెషన్లలో 409 మౌఖిక ప్రదర్శనలు 750 పోస్టర్ ప్రజెంటేషన్ల కోసం సారాంశాలను సిఫార్సు చేశారు. జపాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెటల్స్ అండ్ మెటీరియల్స్ సహకారంతో రెండు ప్రత్యేక సెషన్లు ఏర్పాటు చేస్తున్నారు. అత్యాధునిక సాంకేతికతలను ప్రదర్శించే 40 మందితో లోహ శాస్త్రం, మెటీరియల్స్ ఇంజనీరింగ్‌లో ప్రస్తుత పోకడలు, వ్యూహాత్మక దిశలపై నిపుణులు ప్రసంగించనున్నారు. ప్రముఖ లోహశాస్త్ర నిపుణులు, పరిశోధకుల ప్రదర్శనల ద్వారా బలమైన పరిశ్రమ విద్యా భాగస్వామ్యాలను ఐఐటీహెచ్ పెంపొందిస్తుందని తెలిపారు. ఈ సమావేశం మెటీరియల్స్ మెటలర్జికల్ ఇంజనీరింగ్ రంగానికి ఒక మైలురాయి అవుతుందని ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి ఆకాంక్షించారు.


అంతర్జాతీయ సదస్సు వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఐఐటీహెచ్ అధికారులు

సంగీత, నృత్య, నాటక పోటీల్లో జాతీయస్థాయికి ఎంపికైన మర్పల్లి పాఠశాల ఉపాధ్యాయుడు


ఉపాధ్యాయుడు ఆదిత్యగౌడ్

రేగోడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ వారు నిర్వహించిన అఖిల భారత సివిల్ సర్వీస్ సంగీత, నృత్య, నాటక పోటీల్లో రేగోడు మండలానికి చెందిన టీచర్ ఎంపికయ్యాడు. మండలంలోని మర్పల్లి పాఠశాలలోని ఉపాధ్యాయుడు ఆదిత్యగౌడ్ సంగీతం విభాగంలో ప్రతిభ కనబరిచగా జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఆయనను ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్‌గౌడ్, మండల అధ్యక్షుడు సందీప్, ప్రధానకార్యదర్శి నరేష్ అభినందించారు.

పది విద్యార్థులకు అల్పాహారం ఏది?


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

రామచంద్రాపురం టౌన్ నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సాయంత్రం సమయంలో అల్పాహారం అందించేటట్టు విద్యాశాఖ ఆదేశాలు జారీ చేయాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి కోరారు. రాష్ట్రంలో రెండు లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చదువుతున్నారని వివరించారు. ఎక్కువగా నిరుపేదలు చదువుతుంటారని తెలిపారు. వారికి నిత్యం పౌష్టికాహారం అందించినప్పుడే పరీక్షల్లో రాణించగలుగుతారని వివరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బడిలోనే సమయాన్ని గడిపినందున సహజంగానే ఆకలి వేస్తుంటుందని తెలిపారు. అటువంటి సందర్భాలను గుర్తించి విద్యార్థులకు అల్పాహారం అందించాలని కోరారు. సాయంత్రం సమయంలో పది పరీక్షలకు సన్నద్ధం చేయడానికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని కోరారు. ప్రత్యేకంగా ఉపాధ్యాయుల నియామకం చేపట్టి ఆసక్తి పెంచేటట్టు పాఠ్యబోధన జరపాలని తెలిపారు. పదో తరగతి విషయంలో విద్యార్థులకు సాయంత్రం పాఠశాల ముగిసిన తరువాత గంట సమయం, ఉదయం బడి ప్రారంభం కాకముందు గంట సమయం చొప్పున అదనపు బోధన చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆయా సమయాల్లో కావాల్సిన అల్పాహారం అందించగలిగితే నిరుపేద విద్యార్థుల్లో చదువుకోవాలన్న ఆసక్తి పెరుగుతుందన్నారు.

రెండో రోజు హోరాహోరీగా క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు



అండర్-14 లీగ్‌లో విజయం సాధించిన రెడ్ జట్టు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా అండర్-14 ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్ మ్యాచ్‌లు రెండో రోజు కొనసాగాయి. శుక్రవారం కొండాపూర్ మండలం కోనాపూర్ ఎంఎ క్రికెట్ గ్రౌండ్స్‌లో గ్రీన్ జట్టు, బ్లూ జట్టు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన బ్లూ జట్టు నిర్ణిత 50 ఓవర్లలో 168 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేసిన గ్రీన్ జట్టు 33.3 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 169 పరుగులు చేసి విజయం సాధించింది. అదే విధంగా రెండో మ్యాచ్ పీబీఆర్ సింగాపురం గ్రౌండ్స్‌లో ఎల్లో, రెడ్ జట్ల మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన రెడ్ జట్టు 45.3 ఓవర్లలో 213 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ దిగిన ఎల్లో జట్టు 38 ఓవర్లలో 180 పరుగులు చేసి ఆలౌట్ కాగా, రెడ్ జట్టు విజయం సాధించింది.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామాయంపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రామాయంపేట, నిజాంపేట మండలాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ ఆదయ్య తెలిపారు. 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, ట్రీ కటింగ్, కరెంట్ తీగల మార్పుల నేపథ్యంలో ఈ అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు. నాణ్యమైన విద్యుత్ అందించేందుకే ఈ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రామాయంపేట పట్టణంలో డబుల్ బెడ్ రూమ్, కాట్రియాల, లక్ష్మాపూర్, జాన్సీ లింగపూర్, బాచ్చరాజుపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు సమకరిచంఆలని ఏడీఈతోపాటు ఏఈలు తిరుపతిరెడ్డి, గణేష్ కోరారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

సంగారెడ్డి అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని ఈ నెల 29న నిర్వహిస్తున్నట్టు సంగారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ ఉపేందర్ తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యల కోసం ఉదయం 11 నుంచి 12 గంటల మధ్యలో 8500376267 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

అంతర్జాతీయ బాల సమ్మేళనానికి ఎంపిక

హవేళిఘణపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు కీర్తన, అర్పిత, అదీబ, నవదీప్, నవ్యలు అంతర్జాతీయ బాల రచయితల సమ్మేళనం కార్యక్రమానికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరుణాకర్ శుక్రవారం తెలిపారు. ఈ సమ్మేళనంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న 101 మంది తెలుగు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొంటారు. వీరిలో నలుగురు హవేళిఘణపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉండటంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ పోటీల ఫైనల్ సమ్మేళనం ఈ నెల 30న అంతర్జాలంలో జరగనుంది.

వీరభద్ర స్వామి ఆలయ హుండీ లెక్కింపు

గుమ్మడిదల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి వీరన్నగూడెం వీరభద్ర స్వామి ఆలయ హుండీ ఆదాయం లెక్కింపును అధికారులు శుక్రవారం నిర్వహించారు. ఆలయ ఆదాయం రూ.రూ.18,59,93, అన్నదానం హుండీ ఆదాయం రూ.80,23 వచ్చినట్లు చైర్మన్ మద్ది ప్రతాప్‌రెడ్డి, ఈవో శశిధర్ గుప్తాలు వివరించారు. ఈ లెక్కింపు కార్యక్రమం డివిజనల్ ఇన్‌స్పెక్టర్ రంగారావు పర్యవేక్షణలో జరిగింది. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు ఉప్పనూతల అశోక్ గౌడ్, పూజారి కృష్ణ, పొన్నబోయిన రాజు, మండల శ్రీనివాస్ గౌడ్, మద్దటి వీరస్వామి యాదవ్, యాదగిరి గౌడ్, గ్రామ పెద్దలు కుమార్ గౌడ్, లక్ష్మీనారాయణ, శివ కేశవ స్వచ్ఛంద సంస్థ సభ్యులు, ఆలయ పర్యవేక్షకులు సోమయ్య పాల్గొన్నారు.

సకాలంలో వైద్య సేవలు అందించాలి

మనోహరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 108 జిల్లా కోఆర్డినేటర్ రవికుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంబులెన్స్ నిర్వహణ, రికార్డులను పరిశీలించారు. సకాలంలో స్పందించి బాధితులకు దగ్గరలోని ఆసుపత్రికి చేర్చాలన్నారు. మండల వైద్య అధికారి సమంతను 108 సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈఎంటీ పాడేపు శివ, పైలెట్ కోదాస్ రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

రామాయంపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రామాయంపేటలోని ఝాన్సీ లింగాపూర్ మాజీ సర్పంచ్ మానెగళ్ల రామకృష్ణయ్య మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు నేతృత్వంలో శుక్రవారం కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. సుతార్‌పల్లి, అక్కన్నపేట నుంచి మరో ఇద్దరు సర్పంచ్ అభ్యర్థులా అధికార పార్టీకి దగ్గరయ్యారు

బీఆర్ఎస్‌లో చేరిక

రేగోడు నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో రేగోడు మండలం కొత్వాల్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సుధాకర్, సురేందర్, సతీష్, అరుణ్, సావిత్రి, రమేష్, దశరథ్‌లు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ విషయాన్ని పీఏసీఎస్ చైర్మన్ రాజు యాదవ్, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రవీందర్ తెలిపారు.

'సౌకర్యాలు కల్పిస్తాం'

రామచంద్రాపురం టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బస్తీల్లో సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. శుక్రవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి పాతరామచంద్రాపురంలో మురుగు పైపులైన్ నిర్మాణం సమయంలో పడిన గుంతలతో పడుతున్న ఇబ్బందులను ఆమె పరిశీలించారు. రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఏఈ దివ్య, ఆత్మ కమిటీ డైరెక్టర్ నగేష్, పీటర్, కిరణ్‌గౌడ్ తదితరులున్నారు.

పాడవుతున్నా ప్రారంభించరేం?

● కొన్ని నెలలుగా నిరుపయోగంగా దాతలిచ్చిన ఆర్వో ప్లాంటు


చీలపల్లి గ్రామ పంచాయతీలో వృథాగా ఉన్న ఆర్వో ప్లాంట్

ఝరాసంగం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థులకు మినరల్ వాటర్ అందించాలనే ఉద్దేశంతో లక్షలాది రూపాయలు వెచ్చించి దాతలు అందించిన ఆర్వో ప్లాంటును అధికారులు ఉపయోగంలోకి తీసుకురావడం లేదు. దీంతో అది నిరుపయోగంగా దర్శనమిస్తోంది. మండల పరిధిలోని చీలపల్లి గ్రామ పంచాయతీకి గత కొన్ని నెలల క్రితం ఓ వెంచర్ నిర్వాహకులు ఈ ప్లాంటును అందించారు. ఇప్పటివరకు ప్రారంభించకపోవడంతో దాని పరికరాలు పాడవుతున్నాయి. దీనిని వినియోగంలోకి తీసుకువస్తే పంచాయతీ ఆదాయం పెరగడంతో పాటు గ్రామస్థులకు అందుబాటులో మినరల్ వాటర్ లభిస్తాయని గ్రామస్థులు కోరుతున్నారు.

టీఆర్‌టీఎఫ్ సంగారెడ్డి, మెదక్ జిల్లాల నూతన కార్యవర్గాల ఎన్నిక


ఎన్నికైన టీఆర్‌టీఎఫ్ నూతన కార్యవర్గం

సంగారెడ్డి అర్బన్ / మెదక్ అర్బన్/ రామాయంపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టీఆర్‌టీఎఫ్) సంగారెడ్డి జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎన్.శ్రీనివాసులు, అధ్యక్షుడిగా ఎన్.సంగమేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎం.డి.అజ్మతుల్లా, అసోసియేట్ అధ్యక్షుడిగా సయీద్, అదనపు ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్‌రాథోడ్, ఉపాధ్యక్షులుగా సంజీవ్‌కుమార్, విద్యాసాగర్, కన్నోపాత్ర, అరుణలత, కార్యదర్శులుగా జకీర్, నరసింహులు, అనిత, రీనా, వీరన్న, కాంతయ్య, నసీర్, మహిళా కార్యవర్గ సభ్యులుగా విద్యావతి, గీత, సాజిదాబేగం తదితరులను ఎన్నుకున్నారు. అదేవిధగా టీఆర్‌టీఎఫ్ మెదక్ జిల్లా నూతన కమిటీని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ప్రణీద్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా నర్సింగరావు, గౌరవ అధ్యక్షులు ఐలయ్య, అసోసియేట్ అధ్యక్షులు మోహన్‌శర్మ, ఉపాధ్యక్షులు వెంకటేష్, రషీద్, దేవరాజ్, రమేష్, పరమేష్, ప్రవీణ్‌తోపాటు పలువురు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంటు ఏర్పాటుకు సర్వే

నర్సాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళా గ్రూపుల ద్వారా సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసి, వారి ద్వారానే నిర్వహణ చేయించి ఆర్థిక పురోభివృద్ధికి తోడ్పాడు అందించాలనే ఉద్దేశంతో చేపట్టిన ప్రాజెక్టును మొదటగా నర్సాపూర్‌లో ఏర్పాటు చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకోసం స్థానిక లక్ష్మీనారాయణ స్వామి ఆలయానికి చెందిన వంద ఎకరాల స్థలంలో, మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారికి ఆనుకుని గిరిజన గురుకుల పాఠశాల సమీపంలో ఉన్న ఎనిమిది ఎకరాలను సేకరించేందుకు శుక్రవారం సర్వే చేశారు. సర్వే పనులు త్వరలో పూర్తి చేసి, ప్లాంటు ఏర్పాటు చేసి నిర్వహణను మహిళా సంఘాల ప్రతినిధులకు అప్పగించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సర్వేలో ప్రాజెక్టు డీఎం రవీందర్, విద్యుత్తు శాఖ ఏడీఈ రాంమోహన్ రెడ్డి, దేవాదాయ శాఖ ఏవో శ్రీనివాస్, సర్వేయర్ అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.


అయ్యప్పస్వామి పూజలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

వైభవంగా అయ్యప్ప పడిపూజ

పటాన్‌చెరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు పట్టణ పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ హాలులో శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ఆయన సోదరుడు గూడెం మధుసూదనరెడ్డి దంపతులతో కలిసి ప్రత్యేకంగా పూజలు చేశారు. శబరిమలై అయ్యప్ప ఆలయం నుంచి వచ్చిన పూజారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పూజకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డిలు హాజరయ్యారు.

బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థుల ఎంపికపై సమీక్ష

గుమ్మడిదల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గుమ్మడిదల మండల కేంద్రంలోని సీజీఆర్ ట్రస్టు కార్యాలయంలో శుక్రవారం బీఆర్ఎస్ తరఫున సర్పంచ్ అభ్యర్థుల ఎంపికపై కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశంగౌడ్ అధ్యక్షత వహించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పార్టీ విజయాన్ని సాధించేందుకు ప్రతి కార్యకర్త బాధ్యతతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సంతోష్ రెడ్డి, గణేష్ అప్ప, గోపాల్, కొండల్ రెడ్డి, మొగులయ్య, తుపాకుల రాజు, నరహరి, సత్యానారాయణ, శేఖర్ గౌడ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కార్మికులకు స్వెటర్ల పంపిణీ

నారాయణఖేడ్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులు, సిబ్బంది రోజు తెల్లవారు జాము నుంచే విధులు నిర్వర్తించాల్సి ఉన్నందున, చలి తీవ్రత దృష్ట్యా మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కమిషనర్ జగ్జీవన వారికి స్వెటర్లను పంపిణీ చేశారు. స్వెటర్లు ధరించి తగిన జాగ్రత్తలు పాటిస్తూ విధులు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ వెంకటశివయ్య, శానిటేషన్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..

రాష్ట్ర స్థాయి పోటీలకు మడూర్ విద్యార్థి


అక్షిత

చిన్నశంకరంపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చిన్నశంకరంపేట మండలం మడూర్ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని పి.అక్షిత రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు హెచ్ఎం రవిందర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఈ నెల 29 నుంచి డిసెంబరు 2 వరకు జరగనున్న తెలంగాణ అండర్ 18 బాల బాలికల రాష్ట్ర స్థాయి పోటీలలో అక్షిత పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా పీడీ డాక్టర్ అల్లి నరేష్, ఉపాధ్యాయులు విద్యార్థిని అక్షితను అభినందించారు.

పాఠశాల సందర్శన


పాఠశాలను సందర్శిస్తున్న రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ మండలి పరిశీలకుడు శ్రీనివాసులు

తూప్రాన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ మండలి పరిశీలకుడు శ్రీనివాసులు సందర్శించారు. పాఠశాలలో తరగతి గదులను, ఉపాధ్యాయుల బోధన పనితీరును, విద్యార్థుల పఠన సామర్థ్యం, కంప్యూటర్ ల్యాబ్, హాజరు రిజిస్టర్లు, పరీక్ష జవాబు పత్రాలు, వర్క్ బుక్‌లను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. పరిశీలన అంశాల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను అభినందించారు. ఎంఈవో డాక్టర్ పర్వతి సత్యనారాయణ పాల్గొన్నారు.



వారెవ్వా.. వారధి

పటాన్‌చెరు నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : లంకలో ఉన్న సీతాదేవిని తీసుకురావడానికి వానర సైన్యం శ్రీలంక వారధిని నిర్మిస్తున్నట్టుగా, వానరులు పెద్ద రాళ్లను సముద్రంలో వేస్తున్నట్టుగా, సీతారామలక్ష్మణాంజనేయులు పడవలో నదిలో విహరిస్తున్నట్టుగా ఏర్పాటు చేసిన బొమ్మలు చూపరులను ఆకట్టుకున్నాయి. పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పట్టణంలో నిర్వహించిన అయ్యప్ప పడిపూజలో ఈ దృశ్యాలు దర్శనమిచ్చాయి.

'చెకుముకి'లో విద్యార్థుల ప్రతిభ


విజేతలకు జ్ఞాపిక అందజేస్తున్న సెయింట్ ఆంథోనీస్ విద్యాసంస్థల అధినేత సలోమన్‌రెడ్డి, డైరెక్టర్లు

న్యూస్ నెట్‌వర్క్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక, జిల్లా సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో నర్సాపూర్‌లోని లయన్స్ క్లబ్ భవనంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ ప్రతిభ పోటీ పరీక్షల్లో పలు పాఠశాలల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన సుమారు వంద మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

సంగారెడ్డిలోని శాంతినగర్‌కు చెందిన సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ పాఠశాలకు చెందిన వేదశ్రీ, వృషాంక్, శ్రీరాఘవలు జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించి, డిసెంబరులో కరీంనగర్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సలోమన్ రెడ్డి, డైరెక్టర్లు అభినందించారు.

● రామాయంపేటలోని మంజీరా స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. 10వ తరగతి విద్యార్థిని మహతి, 9వ తరగతికి చెందిన అఖిల, శివకుమార్‌లు డిసెంబర్ 12న కరీంనగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని కరస్పాండెంట్ జితేందర్‌రెడ్డి, వాసవి తెలిపారు.

● చేగుంటలోని శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు అనుతి, వెంకట చైతన్య, ఆరుషిలు జిల్లాస్థాయి చెకుముకి పోటీల్లో తృతీయ బహుమతి సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ రేణుక లింగమూర్తి తెలిపారు.


సంగారెడ్డిలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

న్యూస్ నెట్‌వర్క్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భారత ప్రథమ సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బీసీ సంక్షేమ సంఘాల నేతలు ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి సేవలను స్మరించుకున్నారు.


బీఆర్ఎస్ మెదక్ జిల్లా కార్యాలయంలో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నేతలు, మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్

నామినేషన్ కేంద్రాల పరిశీలన

న్యూస్ నెట్‌వర్క్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల విధుల్లో అధికారులు నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా వ్యవహరించాలని సంగారెడ్డి ఆర్డీవో రాజేందర్ పేర్కొన్నారు. శుక్రవారం తొగర్‌పల్లి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు.

● తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ల ఏర్పాట్లను పరిశీలించారు. పాత కుల ధ్రువీకరణ పత్రాలు ఉంటే సరిపోతుందని, లేకుంటే తహసీల్దార్ల వద్ద ఇద్దరు సాక్షుల సంతకాలతో దరఖాస్తు సమర్పిస్తే అప్పటికప్పుడు కుల ధ్రువీకరణ పత్రం జారీ చేస్తారని తెలిపారు.

● మెదక్ ఆర్డీవో రమాదేవి రేగోడు మండల పరిషత్ కార్యాలయం, పెద్దశంకరంపేట ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ల ప్రక్రియను పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు.

● ఆందోల్- జోగిపేట ఆర్డీవో పాండు మేడుకుందా, పోతుల బొగుడ పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా తగు జాగ్రత్తలు పాటించాలని అధికారులకు ఆదేశించారు.

● కంది మండలంలోని కంది, కాశీపూర్, జుల్‌కల్ నామినేషన్ కేంద్రాలను డీఎస్పీ సత్తయ్యగౌడ్ తనిఖీ చేశారు. తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ చిల్‌పచెడ్ మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

● చేగుంట ఎంపీడీవో చిన్నారెడ్డి, తాసిల్దార్ శివప్రసాద్, ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి ఎన్నికల నిబంధనలను వివరించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు

నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లు

పుల్‌కల్/చేగుంట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పుల్కల్, చౌటకూర్ మండలాల్లోని గ్రామ పంచాయతీ, వార్డు పదవుల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవోలు ఆనందమేరీ, కె.శంకర్ తెలిపారు. పుల్కల్ ఎంపీడీవో సమావేశ మందిరంలో 12 పంచాయతీలకు, రైతు వేదికలో 7 పంచాయతీలకు కౌంటర్లు ఏర్పాటు చేశారు. చౌటకూర్ రైతు వేదిక, సుల్తానాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో, శివంపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆయా గ్రామాల నామినేషన్లను స్వీకరిస్తారు. శివంపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించనున్నారు. చేగుంట మండలంలోని 28 గ్రామ పంచాయతీలకు ఏడు కౌంటర్లు ఏర్పాటు చేసి నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఎంపీడీవో చిన్నారెడ్డి తెలిపారు.


నాయిని చెరువులో చేప పిల్లలు వదులుతున్న అధికారులు

3.64 లక్షల చేప పిల్లల విడుదల

పుల్‌కల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలంలోని ఆరు చెరువుల్లో 3.64 లక్షల చేప పిల్లలను మత్స్య సహకార సంఘం జిల్లా డైరెక్టర్ నాగరాజు శుక్రవారం విడుదల చేశారు. మండల కేంద్రమైన చౌటకూర్‌లోని నాయిని చెరువు, సుల్తానాపూర్, పోసానిపల్లి పెద్ద చెరువుల్లో 60 వేలు, ఉప్పరిగూడెంలోని కోమటి చెరువులో 70 వేలు, కోర్పోలులోని మల్కచెరువులో 40 వేలు, పటేల్ చెరువులో 74 వేల చేప పిల్లలను వదిలినట్లు ఆయన తెలిపారు. ఈ చేప పిల్లలు ఏడాదిలో పెరిగి పెద్దవయ్యాక మత్స్యకారులు వాటిని మార్కెట్‌లో విక్రయించుకోవచ్చని సూచించారు. వచ్చే వేసవిలో చెరువుల్లో నీటి నిల్వలు తగ్గకుండా మత్స్యకారులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.శంకర్, ఎంపీవో సువర్ణ, మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు గారెల నర్సింహులు, పోచయ్య, బాలయ్య, నారాయణ, పవన, రాములు పాల్గొన్నారు.

వరి కొయ్యలు కాల్చవద్దు : ఏడీఏ


సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలో అవగాహన కలిగిస్తున్న అధికారులు

చిన్నశంకరంపేట/సంగారెడ్డి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వరి కొయ్యలు కాల్చడం వల్ల భూసారం తగ్గి, పంట దిగుబడులు తగ్గుతాయని ఏడీఏ దేవకుమార్ శుక్రవారం చిన్నశంకరంపేట మండలం అంబాజీపేట తదితర గ్రామాల పొలాలను సందర్శించి రైతులకు యాసంగి పంటల సాగుపై అవగాహన కల్పించారు. పంట కోసిన తర్వాత నెల రోజుల పాటు భూమిని ఆరనివ్వాలని, కొయ్యలను కాల్చకుండా నీటిలో మురగబెట్టడం ద్వారా లాభం ఉంటుందని సూచించారు. అలాగే సంగారెడ్డి మండలం ఫసల్‌వాది, ఇస్మాయిల్ ఖాన్‌పేట, కులబ్‌గూర్ తదితర గ్రామాల్లో ఏడీఏ వెంకటలక్ష్మి రైతులకు అవగాహన కలిగించారు. పంట అవశేషాలు కాలిస్తే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఏవోలు లక్ష్మీప్రవీణ్, ఝాన్సిలక్ష్మీబాయి, ఏఈవోలు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి

● ఎమ్మెల్యే సునీతారెడ్డి


నర్సాపూర్ మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలలో బీఆర్ఎస్ మద్దతు అభ్యర్థులు అత్యధిక స్థానాలు గెలుచుకుని నియోజకవర్గంలో పార్టీ సత్తా చాటాలని స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన నర్సాపూర్ మండల కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు అధికారంలో లేమన్న ఆందోళన వద్దని, తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటూ సహాయం అందిస్తానన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ, ఇచ్చిన హామీలను నెరవేర్చని తీరును ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు శేఖర్, మాజీ జడ్పీటీసీ బబియానాయక్, మాజీ ఆత్మకమిటీ చైర్మన్ శివకుమార్, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జీతెందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించాలి

● పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సూచన


పీసీసీ అధ్యక్షుడితో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నాయకులంతా కలిసికట్టుగా సమన్వయంతో పని చేసి సర్పంచ్ స్థానాలలో కాంగ్రెస్ మద్దతుదారులను అత్యధికంగా గెలుపించుకుని సత్తాచాటాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌కు సూచించారు. హైదరాబాద్‌లోని పీసీసీ అధ్యక్షుడి స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నాయకుడు మైనంపల్లి హన్మంత్‌రావుతో కలిసి ఆంజనేయులుగౌడ్ ఆయనను కలిశారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా రాజకీయ పరిస్థితులు, పార్టీ స్థితిగతులు, సర్పంచ్ ఎన్నికల అంశాలపై మాట్లాడారు. మెదక్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి గ్రామాలలో బలమైన కేడర్ ఉందని, అందరినీ కలుపుకుని పనిచేయాలని పీసీసీ అధ్యక్షుడు కోరారు.

ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేయాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి


మాట్లాడుతున్న గోదావరి అంజిరెడ్డి

వట్‌పల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ తరఫున సర్పంచులు, వార్డు సభ్యులు అన్ని స్థానాల్లో పోటీ చేయాలని జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, మాజీ ఎంపీ బీబీ పాటిల్ పిలుపునిచ్చారు. పోతులబోగుడలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బీజేపీ అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తిరెడ్డి, ఆందోల్ అసెంబ్లీ కన్వీనర్ మఠం చంద్రశేఖర్, జిల్లా కౌన్సిలింగ్ మెంబర్ సురేష్ గౌడ్, మండల అధ్యక్షుడు అశోక్ కుమార్, సీనియర్ నాయకులు జగదీశ్వర్, బసవరాజు పాల్గొన్నారు.

మైక్రో ఇరిగేషన్‌తో మెరుగైన నీటి నిర్వహణ

● వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రమణారావు

కంది, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో మైక్రో ఇరిగేషన్ సిస్టం (సూక్ష్మ నీటి పారుదల)తోనే అసలైన నీటి నిర్వహణ జరుగుతుందని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కె. వి.రమణారావు అన్నారు. సంగారెడ్డి జిల్లా కందిలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించిన సందర్భంగా ఆయన విద్యార్థులకు నూతన వ్యవసాయ పద్ధతులు, మైక్రో ఇరిగేషన్ సిస్టంపై అవగాహన కల్పించారు. పంటలకు బిందుసేద్యం, స్ప్రింక్లర్ల ద్వారా నేరుగా మొక్కల వేర్లకు నీరు అందించే పద్ధతులను, వాటి ప్రయోజనాలను వివరించారు. తక్కువ నీటిని ఉపయోగించి ఎక్కువ పంటలు పండించేందుకు పరిశోధనలు జరపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్. ఆర్. స్వామి, ప్రొఫెసర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.